


ఆకాశం కేసి దిగులుగా చూశాడు నత్తెయ్య.

తాపీగా గద్దలు వలయాలు తిరుగుతున్నాయి. ఎక్కడా అరచెయ్యంత మబ్బుతునక కూడా లేదు.

నత్తెయ్య చూపులు క్రిందకి దిగి వచ్చి ఎదురుగా ఉన్న పొలం మీద వాలాయి. ఇరవై ఎకరాలు. తనవి అయిదెకరాలే... కుటుంబానికి చాలటం లేదని సీతంరాజుగారివి మరో పదేను ఎకరాలు 'కౌలు' కి తీసుకున్నాడు. ఇంటిదాని రోగం కోసం, కూతురు పెళ్ళికోసం చేసిన అప్పుల నుండీ బయటపడొచ్చని ఆశపడ్డాడు. పిండికట్టల (ఎరువు) కోసం ఒక మాటు సీతంరాజుగారి ముందు నిలబడితే ఆయన నవ్వి "చెరువు ఈదలేనివాడివి నదిలోకి దూకితే ఎట్లారా?" అన్నాడు.

"దేవుడి మీద, మీ మీద బారం ఏశాను, బాబూ. మునిగినా, తేలినా సరే..." మొండిగా అన్నాడు.

"దేవుడి సంగతేమోగానీ, నన్ను నమ్మినవాణ్ణి మాత్రం నేను ముంచను. పెద్దపాలేరు రామయ్యతో నేను చెప్పానని చెప్పి నీకు కావాల్సిన కట్టలు తీసుకెళ్ళు..."

నత్తెయ్యకి పరమానందమయింది.

"మీ మేలు మరవలేనయ్యా..." చేతులు జోడించి సంబరంగా వెళ్ళేడు. పెద్ద పాలేరు నడిగి పిండి కట్టలు తెచ్చుకుని పొలంలో చల్లుకున్నాడు.

కలుపు తీయటం అయింది.

నారునంతా చక్కగా వాడుకోగలిగాను గదా అని పడిన తృప్తి దక్కకుండా వానచినుకు లేక మొక్క ఎండిపోసాగింది.

కాలవ లొదిలినా నీరు తన పొలందాకా రావటం లేదు.

